క్లుప్తంగా

'నన్నయ'లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయనిర్మల

రాజానగరం: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ సహకారంతో శుక్రవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ జరిగింది. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రోగ్రాం కన్వీనర్‌గా వ్యవహరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల మాట్లాడుతూ సమైక్యత కోసం, దేశ సమగ్రత కోసం వల్లభాయ్ పటేల్ అందించిన సేవలను గుర్తు చేశారు. విద్యార్థులకు విజిలెన్స్ అవేర్‌నెస్‌పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, వి.పద్మావతి, ఎంవీఎస్ఎస్ నారాయణ, వై.సుష్మాప్రియ, బి.రాజశేఖర్, ఎల్.ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ ఆశ్రమం సందర్శన

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమాన్ని ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన జిల్లా ఇన్‌చార్జి దేవకి దేవి శుక్రవారం సందర్శించారు.ఆశ్రమ ప్రతినిధి సుశీలతో చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో భాగంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఇందులో ఇరవై ఏళ్ల లోపు యువతీ, యువకులు ఉంటారన్నారు. వీరికి వేర్వేరుగా హాస్టళ్లు ఏర్పాటు చేసి, శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఆశ్రమాన్ని పరిశీలించామన్నారు. తరగతులు ఎక్కడ నిర్వహించాలనేది ఇంకా పరిశీలనలో ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపి నాయకులు ఏపీఆర్ చౌదరి, నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బాలికలను చదివిద్దాం..

మధురపూడి: కోరుకొండ విరియాల వెంకటరెడ్డి పంతులు సత్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం- బాలికలను చదివిద్దాం సమావేశాన్ని నిర్వహించనున్నట్టు పీఓ జాన్సీరాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ కార్యక్రమం ఉంటుందన్నారు.

దీపం పథకం ప్రారంభం

సీతానగరం: దీపం పథకం-2ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీఓ ఎం.భారతి పాల్గొన్నారు.
మధురపూడి: కోరుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద దీపం పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్తికమాసం సందర్భంగా నెలంతా ఇక్కడి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు అన్నదానం చేయనున్నట్టు తెలిపారు.
రాజానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఎమ్మెల్యే బలరామకృష్ణ ప్రారంభించారు.
పెదపూడి: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో దీపం-2 పథకంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో 21,868 మంది లబ్ధిదారులకు ఈ పథకం అమలు చేస్తున్నారన్నారు.

సూర్యప్రకాశరావుకు నివాళి

మధురపూడి: మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, పీసీసీ సభ్యుడు ఉల్లి సూర్యప్రకాశరావు 73వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. కోరుకొండ ఎస్‌బీఐ సమీపంలోని సూర్యప్రకాశరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నీరుకొండ బాబ్జి మాట్లాడుతూ ఉల్లి కుటుంబం దాతృత్వానికి చిరునామా అన్నారు. జంభూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

మధురపూడి: స్థానికంగా కోడిపందేల శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,800 స్వాధీనం చేసుకున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

రాజానగరం: ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కానవరంలో జరిగింది. ఎస్సై నాగేశ్వర్ కథనం ప్రకారం.. కానవరానికి చెందిన పాటి సుబ్బారావు (56) తాగుడుకు బానిసై, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీంతో ఆవేదనకు గురైన అతని భార్య, కొడుకులిద్దరూ గురువారం అతనిపై కోపగించుకున్నారు. తాగుడితో కుటుంబాన్ని పట్టించుకోకపోయినా, తన ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని మందలించారు. దీంతో మనస్తాపం చెంది సుబ్బారావు పురుగు మందు తాగాడు. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు.

సీతాఫలం... ఎంతో ప్రియం

- ముగుస్తున్న సీజన్
- పెరిగిన ఫలాల ధర

రాజానగరం: సీతాఫలం.. ఆ టేస్టే వేరు. దీనిని ఇష్టపడని వారుండరు. చిన్నా పెద్దా ఎంతో అమితంగా ఆరగిస్తుంటారు. రుచిలో సిమ్లా యాపిల్‌ను తలపించే సీతాఫలం ప్రస్తుతం మార్కెట్‌లో అందనంత ఎత్తులో ఉంది. దీని ధరను చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. అందుకే వీటి సీజన్‌లో రుచి చూడాలనే ఆశతో కొనాలనుకునే సామాన్యులకు మార్కెట్‌లో పలుకుతున్న ధరతో ఇది అందని ఫలంగా మారిపోయింది. మెట్ట ప్రాంతంగా పిలువబడే చాగల్నాడు ప్రాంతంలో పండే సీతాఫలాలు రుచిలోనే కాదు ఆకారంలో కూడా ఆకట్టుకునే విధంగా నిగనిగలాడుతూ ఉంటాయి. కళ్లు విచ్చుకుని, రెడీ టూ ఈట్ అన్నట్టు కనిపిస్తుంటాయి. అందుకే వీటికి దేశ రాజధాని ఢిల్లీలో సైతం మంచి పేరుంది. రాజకీయ ప్రముఖులతో పని ఉన్న వ్యక్తులు కొందరు వీటిని కానుకగా అందజేయడం ద్వారా వీటికి ఈ ఖ్యాతి లభించింది. ఇదంతా ఒకప్పటి మాట, నేడు ఈ ఫలాలు దొరకడమే గగనం అయ్యింది.

కనుమరుగవుతున్న తోటలు

రియల్ ఎస్టేట్ ప్రభావంతో చాగల్నాడు ప్రాంతంలో ఇతర పండ్ల తోటలతో పాటు సీతాఫలాల తోటలు కూడా కనుమరుగైపోతున్నాయి. ఈ క్రమంలో పది, పదిహేనేళ్ల కింద వంద ఫలాలు రూ. 50 నుంచి రూ. వందకు లభించేవి. తోటలు లేకపోవడంతో ఫలాల ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. ఈ విధంగా ఫలాల దిగుబడి లేకపోవడంతో మార్కెట్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. చాగల్నాడు సీతాఫలాలు సాధారణంగా దసరా రోజుల్లో మార్కెట్‌లోకి వస్తుంటాయి. కానీ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో కాస్త ఆలస్యమై, ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నాయి. చాగల్నాడు సీతాఫలాలకు రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకూ జాతీయ రహదారి పొడవునా మార్కెట్‌గా ఉంటుంది. కానీ ప్రస్తుతం వీటి దిగుబడి చాలావరకూ తగ్గిపోవడంతో తోటలు పోయి, అక్కడే నేరుగా కొనుగోలు చేసేస్తున్నారు. ఈ క్రమంలో అడపాదడపా మార్కెట్ వచ్చే ఫలాలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. సీతాఫలాలను డజను, పాతిక చొప్పున విక్రయిస్తున్నారు. కాస్త పెద్ద సైజు ఉన్న ఫలాలు డజను రూ. 1,800 రేటు పలుకుతుంది. ఈ క్రమంలో వంద ఫలాల ధర రూ. 7,200లుగా ఉంది. విడిగా కొనాలంటే రూ. 70 పైబడి సమర్పించాల్సిందే. కాయల సైజు తగ్గితేనే ధర తగ్గుతుంది తప్ప లేకుంటే తగ్గేదే లే.. అన్నట్టుగా చాగల్నాడు సీతాఫలాల మార్కెట్ కొనసాగుతుంది. ఇది కూడా ఒక వారం పాటు ఉంటుందని, ఆపై చాగల్నాడు సీతాఫలాలు దిగుబడే ఉండదని వ్యాపారులు అంటున్నారు.


రాజానగరంలో జాతీయ రహదారి వెంబడి సీతాఫలాల దుకాణాలు


చాగల్నాడు సీతాఫలాలు

సోలాపూర్ నుంచి దిగుమతి

సీతాఫలాల సీజన్ సాధారణంగా నవంబర్ మాసంతో పూర్తవుతుంది. కానీ ఈ సీజన్‌ని మరో నెలా 15 రోజులు పైబడి కొనసాగించే విధంగా మార్కెట్‌లోకి సోలాపూర్ సీతాఫలాలు దిగుమతి అవుతున్నాయి. యాపిల్స్ బాక్స్‌లతోపాటు సోలాపూర్ నుంచి సీతాఫలాలను కూడా బాక్సుల్లో తీసుకువచ్చి, ఇక్కడ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. చూడటానికి చాగల్నాడు సీతాఫలాలను మైమరపించే రీతిలో నిగనిగలాడుతూ ఉండే ఈ ఫలాలు రుచి బాగానే ఉంటుంది. కానీ కొన్నింటిలో పురుగులు ఉంటున్నాయి. ఈ కారణంగా తెలిసిన వారు వీటికి దూరంగా ఉంటున్నారు. ఏదేమైనా సీతాఫలాల వ్యాపారం జోరుగా సాగుతోంది.

ఆగితే నడకే..


పురుషోత్తపట్నం- రామచంద్రపురం మధ్య ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురవడంతో నడిచి వెళ్తున్న ప్రయాణికులు

సీతానగరం: గోతులు తిప్పలు పెడుతున్నాయి.. నడకకే నరకం చూపిస్తున్నాయి.. ఇక బండెక్కితే వేరే చెప్పాలా!.. పురుషోత్తపట్నం – సీతానగరం ఏటిగట్టు రోడ్డులో పరిస్థితి ఇది. ఏటిగట్టు రోడ్డుపై పడిన గోతుల్లో పోలవరం ప్రాజెక్ట్ పనులు చేపట్టిన మెగా కంపెనీ వారు క్వారీ బూడిద వేసి మమ అనిపించారు. దీంతో వాహనాలు తిరిగే సమయంలో దుమ్మూధూళి ఎగసి పడుతోంది. ఇలా గోతులు యథావిధిగా పడ్డాయి. వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. గురువారం ఓ ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురైంది. దీంతో ప్రయాణికులు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఆటోలు, బైక్‌లు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బాపనమ్మ తల్లి ఆలయంలో సినీనటి మల్లిక ప్రత్యేక పూజలు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామంలోని బాపనమ్మ తల్లి ఆలయంలో ప్రముఖ సినీ నటి మల్లిక శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తన స్వగ్రామం మండపేట అన్నారు. త్వరలో తన వివాహం జరగనున్న నేపథ్యంలో ఈ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న సినీనటి మల్లిక

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్లకు నాయకత్వం

పెదపూడి: రాష్ట్ర స్థాయి బాల్, బ్యాడ్మింటన్ జట్లకు పురుషుల, మహిళల విభాగాల్లో కెప్టెన్లుగా అనపర్తిలో జీబీఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ స్వామి తెలిపారు. జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ జట్లకు కెప్టెన్ల ఎంపిక జరిగిందన్నారు. ఈ ఎంపికలో పురుషుల జట్లకు సీఈసీ విద్యార్థి హేమంత్ దుర్గ, మహిళల విభాగంలో బూడి ప్రసన్న భార్గవి ఉత్తమ ప్రతిభతో కెప్టెన్లుగా రాష్ట్ర స్థాయి జట్లకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి ఆదిరెడ్డి(కొండబాబు), పాలకవర్గ సభ్యులు జి.రామారెడ్డి, డైరెక్టర్లు అభినందించారు.


హేమంత్ దుర్గ


ప్రసన్న భార్గవి

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

పెదపూడి: రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జి.మామిడాడలో పీఎంశ్రీ బాలుర ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోరాడ శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ తమ విద్యార్థులు భువనేశ్వరి, నాగలక్ష్మి, గోవిందు అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పల్నాడు జిల్లాలలో జరిగే రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

కడియం: నర్సరీల్లో పనులకు వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. నర్సరీ పనులకు వెళ్లే మహిళలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా కాకుండా అందరూ కలిసి వెళ్లడం ఉత్తమమన్నారు. ఎవరైనా అసభ్యకంగా ప్రవర్తిస్తే, అనుమానాస్పదంగా తిరిగినా వెంటనే 112కి కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ఎస్సై ధనలక్ష్మి ప్రసన్న, మహిళా రక్షక్ టీం సభ్యులు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ ప్రసన్న తదితరులు

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

రాజానగరం: రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించారు. అందరికీ స్వీట్లు పంచారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సముద్రాల రాంబాబు, సభ్యుడు గ్రంధి నానబ్బులు, కోశాధికారి దవులూరి శ్రీను, గిరిబాబు, కంకటాల రాజు, చిన్న, మండ రాంబాబు, గ్రంధి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


రాజానగరంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

వెలుగుల పండగ.. ఆనందమే నిండుగ


రాజానగరం షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆకట్టుకున్న దీపాల అలంకరణ

రాజానగరం: నియోజకవర్గంలో దీపావళి పండుగను గురువారం సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. సాయంత్రం వేళలో లక్ష్మీకటాక్షాన్ని కోరుతూ పూజలు చేశారు. దీపావళి మందుగుండు సామాన్ల ధరల రేట్లు ఆకాశాన్నంటినా ఎక్కడ తగ్గకుండా వాటిని కొనుగోలు చేసి కాల్చారు. దీపావళి ముందు రోజు భారీగా వర్షం కురవడంతో విక్రయాలు పెద్దగా జరగలేదు. దీపావళి రోజు వాతావరణ అనుకూలించడంతో వ్యాపారాలు జోరందుకున్నాయి. రాజానగరం షిరిడీ సాయిబాబా ఆలయంలో ఏటా ఒక ప్రత్యేకత ఒరవడితో సాగే దీపావళి ఈసారి కూడా అందరినీ ఆకట్టుకునే రీతిలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు నీలపాల సుబ్రహ్మణ్యం సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో అరటి బొందలతో అలంకరించారు. ఇందులో ప్రమిదలను పెట్టి దీపాలను వెలిగించడంతో దీపాల కాంతులు ఆకట్టుకున్నాయి. ఆ వెలుగుల్లో సాయిబాబా, ఇతర దేవతా మూర్తుల స్వరూపాలు కూడా కొత్త అనుభూతిని అందించాయి. దీపావళి మరుసటి రోజు నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతుంది. దీనితో ఆలయాల వద్ద శుక్రవారం సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ధ్వజ స్తంభాలకు వాటిని కట్టారు. ఈ విధంగా కార్తిక మాసం నెల రోజులూ ఆకాశ దీపాలను వెలిగిస్తుంటారు.


పందలపాకలో బాణసంచా వెలిగిస్తున్న చిన్నారులు

అంబరాన్ని తాకిన దీపావళి సంబరాలు

బిక్కవోలు: దీపావళి పండగను గురువారం రాత్రి అన్ని గ్రామాల్లోనూ ఘనంగా జరుపుకొన్నారు. సాయంత్రం లక్ష్మీదేవి పూజలు చేశారు. ఇంటి ఆవరణలో ప్రమిదలతో దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి స్వాగతం పలికారు. కుటుంబ సమేత భోజనాలు చేసిన అనంతరం చిన్నా పెద్ద తేడా లేకుండా బాణసంచా వెలగించారు. శుక్రవారం ఉదయం అమావాస్య ఉండడంతో శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభించనున్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఇద్దరికి గాయాలు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలో రెండు బైకులు ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు రంగంపేట మండలం సింగంపల్లి గ్రామం నుంచి నాగరాజు అనే వ్యక్తి బైకుపై రాయవరం వెళుతున్నాడు. కొమరిపాలెం గ్రామానికి చెందిన దంగేటి వైష్ణవి స్కూటీపై బలభద్రపురం వైపు వెళుతోంది. వీరిరువురూ కొమరిపాలెం వంతెన వద్ద ఎదురెదురుగా వచ్చిన సందర్భంలో ఢీ కొన్నారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు.

మద్యం దుకాణంపై విచారణ

బిక్కవోలు: మండలంలోని పందలపాక రావిచెట్టు వద్ద ఉన్న మద్యం షాపుపై ఎక్సైజ్ సీఐ సుధ విచారణ చేశారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేయడం జరిగిందన్నారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

4 నుంచి ఫ్లషింగ్ ఆపరేషన్

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకూ ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. సోమవారం పశ్చిమ డెల్టా, మంగళవారం మధ్య డెల్టా, బుధవారం తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద ఫ్లషింగ్ ఆపరేషన్ చేస్తామన్నారు. వరదల సీజన్‌లో గేట్ల వద్దకు వచ్చి చేరిన మట్టి, చెత్త ఫ్లషింగ్ ఆపరేషన్ ద్వారా దిగువకు కొట్టుకుపోతుందన్నారు. దీని ద్వారా రానున్న రబీలో నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఉంటాయని ఈఈ వెల్లడించారు.


తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద నిర్వహిస్తున్న ఫ్లషింగ్ ఆపరేషన్ (ఫైల్)

శ్రీదేవీ కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


చంద్రేడులోని శ్రీదేవీ కనక దుర్గమ్మ

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువై యున్న శ్రీ దేవీ కనక దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, వ్రత పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.

విజయ దుర్గమ్మకు పంచామృతాభిషేకాలు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా పంచామృతాభిషేకం చేపట్టారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు.

నేడు అయ్యప్ప పడిపూజ

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో శనివారం అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు మణికంఠ క్షేత్రం గురుస్వామి చొల్లంగి అర్జునరావు గురుస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఏడీబీ రోడ్డు పక్కన కొలువై యున్న అలమేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న మణికంఠ క్షేత్రం వద్ద శనివారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు జరిగే పడిపూజకు మండలంలోని అయ్యప్ప స్వామి మాలధారులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉదయం 6 గంటలకు తూము శ్రీను దంపతులచే గణపతి హోమం, 108 కలశాలతో స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామికి జలాభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సంతర్పణ, సాయంత్రం 5 గంటలకు అఖండ హారతితో గ్రామంలో ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

పెదపూడి: సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి సామాజిక ఆరోగ్యకేంద్రం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం వైద్యులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనూష, వరప్రసాద్, హర్షవర్ధన్, సుభాష్, సొసైటీ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, ఇతర వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు గ్రామంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సామాజిక పింఛన్లు అందజేశారు. తొలిరోజు నూరు శాతం పింఛన్ పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ కూటమి నాయకులు పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి డిప్యూటీ సీఎం

మధురపూడి: మధురపూడిలోని విమానాశ్రయానికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శుక్రవారం మధ్యాహ్నం వచ్చారు. అనంతరం ఆయన కాన్వాయ్‌లో జగన్నాథపురం వెళ్లారు. ఆయనను మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలిశారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ ఎస్‌జే ఝాన్సీ	: 96520 77166
తహసీల్దార్ ఎస్.లక్ష్మీలావణ్య	: 98499 03900
డిప్యూటీ తహసీల్దార్ ఎ.కుమారి	: 99491 00395
మండల సర్వేయర్ ఇ.అనిత	: 81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ గొలుగూరి బాపిరాజు	: 91823 02929
మండల రీసర్వే డీటీ బి.క్రాంతి	: 7382 286190
మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిం	: 83310 56550
మండల ఇంజినీర్ సంపత్‌కుమార్	: 98661 35609
విద్యుత్ శాఖ ఇంజినీర్, రాజానగరం సుధాకర్	: 94408 12623
విద్యుత్ శాఖ ఇంజినీర్, సంపత్‌నగరం సత్యప్రసాద్	: 94408 12627
మండల విద్యా శాఖాధికారి- 1 రామన్నదొర	: 94409 13928
మండల విద్యా శాఖాధికారి- 2 జ్యోతిప్రసాద్	: 94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సీడీపీఓ టి.నాగమణి	: 94408 14693
ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఏపీఎం సునీత	: 79933 25065
గృహ నిర్మాణ శాఖ డీఈ ఆర్‌వీ బాబు	: 70939 30566
గృహ నిర్మాణ శాఖ ఏఈ ఏవి రామారావు	: 70939 30478
సబ్ రిజిస్ట్రార్, రాజానగరం వెంకటేశ్వర్రావు	: 70939 21434
పోలీసు శాఖ	
రాజానగరం సీఐ ఎస్‌పీ వీరయ్యగౌడ్	: 94407 96585
రాజానగరం ఎస్సై- 1 మనోహర్	: 94932 06031
ఎస్సై- 2 నాగేశ్వర్	: 94904 91132
బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్	: 94407 96533